
# ప్రవాహం

యర్రమిల్లి విజయలక్ష్మి



"వైకుంఠేకాదశి మూడునే వచ్చేసిందేవిటే అమ్మాయీ. ఇంకా నయం కాలెండరు చూసుకున్నాం కాబట్టి సరిపోయింది. కొత్త సంవత్సరం పుష్య శుద్ధ నవమిలాగా ఇంక అన్నీ పర్వదినాలే.." ఉదయకాలపు పూజాదికాలు సంతృప్తికరంగా ముగించుకుని తడి, పొడి మడిగుడ్డలు మార్చుకుని స్థిమితపడ్డాక జగదీశ్వరమ్మగారు నింపాదిగా కళ్ళజోడు తగిలించుకుని హాల్లో పెద్ద సింహాసనంలాంటి పాతకాలపు కొయ్యి కుర్చీలో సుఖాసీనురాలై వెంకట్రామా అండ్ కో వారి తెలుగు కేలండర్ తీసుకుంటుంది. ఏ పండగైనా సరే నాల్రోజులు ముందే జగదీశ్వరమ్మ గారింట్లో పండుగ కళ ప్రవేశిస్తుంది. ఇళ్ళు, వాకిళ్ళు దులుపుకోవటం, కడుక్కోవటం, నావముగ్గులేసి రంగులు నింపటం. గుమ్మం గుమ్మానికీ మావిడాకులు కట్టటం వరసగా పరిస్థితిని బట్టి ముందస్తుగానే ప్రారంభిస్తుందావిడ. అప్పటికీ వారం రోజుల ముందునుంచి దిండు కింద నుంచీ పంచాంగం తీసి.. "అయితే ఏమే వరలక్ష్మి.. మూడవ శనివారమే నంటావేమిటే వైకుంఠేకాదశి" అంటూనే వుంటుంది. అన్నిసార్లూ వరలక్ష్మి ఓపిగ్గా "ఊ..ఊ..అంతే" అంటుంటుంది. నిజానికావిడకు ఇదంతా పట్టదు. కానీ తల్లికోసం కొంత సర్దుకుంటుంది.

అంతతో తృప్తిపడదావిడ. ఆవిడకు కూతురి మాటమీద అసలు లక్ష్యం వుండదు. ఏ కరివేపాక్కనో, గోరింటాక్కనో పూజకి ముందర పూలకోసమనో గుమ్మంలో కొచ్చే వాళ్ళని "వైకుంఠ ఏకాదశి ఎప్పుడంటోందే మీ బామ్మ" అంటే వాళ్ళు వెర్రిమొగం వేసుకుని.. "ఏమీ అంటంలేదండీ మామ్మగారూ.." అంటారు. అటువంటి సమాధానం మామ్మగారు అసలు సహించలేదు. "అనకపోవడమేమిటే పిల్లా! ఇంతంత అక్షరాల్తో కేలండర్లో రాసుంటేనూ.." అని చూపిస్తుంది. ఇదంతా వాళ్ళ కెందుకో వాళ్ళకి తెలియదు. అయినా ఆవిడ్ని ధిక్కరించలేక చూసి "అవునండి మామ్మ గారూ! ఇదిగో మూడో తారీఖు వైకుంఠ ఏకాదశి అని రాశారు." అంటారు. ఆవిడ తృప్తిపడి, "ఊ.. సుందరమ్మకి చెప్పు.." ఇలా ఒకటికి పది అభిప్రాయాలు మూడో తారీఖు మొదటి శనివారమే వైకుంఠ ఏకాదశి అని నిర్ధారించాక మామ్మగారి ఆరాటం మరీ పెరిగిపోతుంది.

ఒక్క ఆ సందర్భమే కాదు పుష్యం మొదలు మార్గశిరం వరకూ సంవత్సరమంతా మూడు వందల ఇరవై రోజులూ వచ్చే పండుగలు, పర్వదినాలు, ఏకాదశులు, జయంతులు, వర్ధంతులు, జాతీయ దినాలూ.. ఏదీ వదలదావిడ. అన్నీ యథావిధిగా ఆయా సందర్భానికి తగినట్టు శాస్త్రోక్తంగా పాటించాల్సిందే. డెబ్భై యేళ్ళు పైబడిన వృద్ధురాలు శరీర శ్రద్ధ ఏమాత్రం లేని మనిషి. ఈ స్నానాలు, తపాలు, జపాలు, పూజలు, గుళ్ళు, గోపురాలు అంటూ ఆరాటపడి ఎక్కడ మూలపడుతుందోనని కూతురు భయం. "ఏవిటేమ్మా.. ఈ చాదస్తం. మరీ నాగుల చవితి, అట్లతద్దికి కూడా. ముఖ్యమైన పండుగలు పర్వదినాలు పాటిస్తే సరిపోదూ" అని విసుక్కుంటుంది.

తల్లి, కూతుళ్ళు మధ్య ఇరవైయ్యేళ్ళ అంతరముంది. ఆవిడీమధ్యే కారణాంతరాల వల్ల పుట్టింటికి తల్లి దగ్గరికి వచ్చిచేరింది.

వరలక్ష్మికి తల్లి ధోరణి నచ్చదు. నచ్చదంటే వినేవాళ్ళు ఆవిడ్ని గురించి ఎగతాళిగా అనుకుంటారని భయం. గొప్పలు చెప్తోందనుకోవచ్చు. మరి అప్పటి స్థితికి ఇప్పటి తమ పరిస్థితికి నమ్మలేనంత తేడా వుంది. అన్నగార్లంతా దూరంలో ఎక్కడెక్కడో స్థిరపడిపోయారు. తనకు, అమ్మకు తలదాచుకోవటానికీ రెండుగదుల పెంకుటింటి వసారా మిగిల్చేసరికి గగనమైపోయింది. తాతలు నేతులు తాగారంటే ఇప్పుడు వినేవాళ్ళు అపహాస్యం చేస్తారు. ఆ స్వాతంత్ర్య సమరం, ఆ ఉద్యమాలు, ఆ జైలు శిక్షలు ఆ కథలన్నీ ఎవరిక్కావాలిప్పుడు! అయినా మామ్మగారు చెప్పేది చెప్పేదే.. ఆ పురవైభవ గాథలు వివరిస్తుంటే లీలగా మెరుస్తుండే అభిజాత్యంతో ఆవిడ ముఖం దేదీప్యమానంగా నాటి వైభవాన్ని తలపిస్తూ వెలిగిపోతుంది. ఏదో చరిత్ర పాఠం వింటున్నట్టుంటుంది వినేవాళ్ళకి.

"ఎంత బతుకు! ఏన్ని చూస్తే ఇంతయ్యాను" అన్న ముక్తాయింపుతో నిట్టూరుస్తుంది. చివరికి వాస్తవంలోకి వచ్చి అసలుపేరు చాలామందికి తెలియదు అందరికీ మామ్మగారే ఆవిడ.

## చమత్కారం

**తి**క్కన, మనుమసిద్ధి మహారాజు కొలువులో భారతం చదివి వినిపిస్తుంటే, తీరికగా రాజు తన జులపాల జుట్టులో గోక్కోవడం గమనించి –

'నీ తల పేనుగంటి' అంటూ పద్యం చదవనారంభించాడు.

తెల్లబోయిన రాజు కొంచెం కోపంతో 'కవిగారూ నా తలలో పేల సంగతి నా దురద సంగతి మీకెందుకు? భారతం వింటున్నాగా కానీయండి' అన్నాడట రాజు.

'అయ్యా నా ఉద్దేశ్యం అదికాదు. నీ తలపేను గంటి అంటే మీ అభిప్రాయం నాకు తెలిసింది అన్న అర్థంలో రాశాను అంతే!' అన్నాడట చల్లగా.

రాజుతోబాటు సభంతా ఘొల్లున నవ్వారట!

**– గాయత్రి**

ఇంటికి పది బారల దూరంలో గోస్తనీ నది సోమేశ్వరస్వామి వారి ఆలయ ప్రాకారాన్ని ఒరుసుకుని ప్రవహిస్తూ వుంటుంది. కార్తీక మాసం నెల మొత్తం ఆవిడకు క్షణం తీరదు. అందుకు తగిన ఏర్పాట్లతో ప్రత్తి కొని వత్తులు చేసుకోవటం ముఖ్యమైనపని. ప్రతీ ఏడు ఆ రోజుల్లో "వత్తుల పత్తి మామ్మగారు!" అంటూ అలవాటుగా ఇచ్చివెడతారు ఒక వ్యాపారి. "పత్తి దొంగతనం గానీ, చెప్పకుండా కాని, ఉచితంగా కానీ తీసుకోకూడదురా అబ్బీ! వచ్చే జన్మలో బొల్లిరోగం పట్టుకుంటుంది." అని గీచి గీచి బేరమాడి, కార్తీకమాసం దీపాలకు, నిత్యదీపారాధనలకు కావల్సినంత పత్తి సేకరిస్తుంది. వత్తులు చేసుకునే పనంటే ఆవిడకు మహా ఉత్సవం. కొన్న పత్తంతా గింజలేరి శుభ్రంగా విడదీసి ముందు ఎండలో పెడుతుంది. భోజనానంతరం మధ్యాహ్నాలు పంచలో కాళ్ళు చాపుకుని కూర్చుని రకరకాల సైజుల్లో బుట్టనిండుగా వత్తులు చేస్తుంది. ప్రత్తి పింజలు తీసి పొడవుగా దారంలాగి చేతులకు వెలిబూడిద పూసుకుని తొడలమీద వుంచి పురెక్కిస్తుంది.

"రెండ్రూపాయలు పడేస్తే కొట్లలో దొరుకుతాయి. ఇంకా ఈ రోజుల్లో వత్తులు చేసుకోవటమేమిటి? పాకెట్లలో మనకే రకం కావాలంటే అవి దొరుకుతుండగా. ఎందుకమ్మా నడుం పడిపోయేట్టు తిండి తినీ తినగానే ఆ పని! కాసేపు నడుం వాల్చకూడదూ. మళ్ళీ నడిరాత్రే లేచి కూర్చుంటావు?" అంటుంది వరలక్ష్మి. కూతురి మాటల్ని జగదీశ్వరమ్మగారు ఎంత మాత్రం ఖాతరు చెయ్యదు. "కార్తీక మాసమంటే ఏమనుకున్నావు. మహా పుణ్య దినాలు. ఈ రోజుల్లో స్నానం, దీపం, ఈశ్వరార్చన ముఖ్యమని చెప్పారు. అష్టమూలక తైలం కాని, ఆవునెయ్యి గాని, కొబ్బరినూనె


## ప్రియదత్త

సకుటుంబ సచిత్ర వారపత్రిక

**విడి ప్రతి వెల : 8 రూపాయలు**

**చందా వివరాలు**

సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 400/-
అర్ధ సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 200/-
మూడు నెలల చందా (పోస్టు ద్వారా) రూ. 100/-

## ఆటవిడుపు

పిల్లల సచిత్ర మాసపత్రిక

**విడి ప్రతి వెల : 8 రూపాయలు**

**చందా వివరాలు**

సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 80/-
అర్ధ సంవత్సర చందా (పోస్టు ద్వారా) రూ. 40/-

సంవత్సర చందాగా రూ. 450/- చెల్లించిన పాఠకులకి ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రికతోపాటు పిల్లల సచిత్ర మాసపత్రిక 'ఆటవిడుపు'ని కూడా ఏడాదిపాటు పోస్టు ద్వారా మీ ఇంటికి పంపటం జరుగుతుంది. ఈ సదవకాశాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవలసినదిగా మనవి చేస్తున్నాము.

మీ చందా మొత్తాన్ని మనియార్డర్ లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా 'ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్' పేర 103/1, లజ్ చర్చి రోడ్, మైలాపూర్, చెన్నయ్-600 004 చిరునామాకి పంపగోరుతున్నాము.

పంపినవారి పేరు, పూర్తి చిరునామా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా మనవి చేస్తున్నాము.
చెన్నయ్‌లో ఉన్నవారు చెక్కు ద్వారా చందా మొత్తాన్ని పంపవచ్చు.

కాని దీపారాధనకు శ్రేష్ఠమని చెప్తారు. వత్తులు కూడా మనం శుచిగా చేసుకున్నవి మాత్రమే ఉపయోగించాలని మా మామ్మ చెప్పేది. ఆవిడ మధ్యాహ్నం పూట మమ్మల్నందరినీ కూర్చో పెట్టుకుని రామాయణం, భాగవతం, భారతం పాడుతూ స్వయంగా పెద్ద తాటాకు బుట్టనిండా వత్తులు చేసి వుంచుకునేది. ఎవరికన్నా కావాలంటే ఇచ్చేది కూడా. ప్రతి ఇంట్లోనూ అంతే. ఈ రోజుల్లో అంటే పత్తి పత్తిలా విడదీసి నాలుగేసి దారపు పోగులు మెరిసిపోయే తగరపు కాగితాల్లో కట్టి అమ్ముతున్నారు కాని, అసలు దైవ కార్యానికి ఉపయోగించేవి మనం స్వయంగా, మడిగా, పరిశుభ్రంగా తయారు చేసుకోవాలి. "ఎవరు చేస్తారో, ఏ చేతులతో చేస్తారో.. వ్యాపారం వ్యాపారమే!"

"నీకు చెప్పలేదేమ్మా ఎవరూనూ" కూతురు సణుక్కుంటుంది.

❊ ❊ ❊



తెల్లారకట్టే – మూడో ఝాము పూర్తికాకుండానే కొబ్బరికాయ, మందార పూలు, రెండరటి పళ్ళు దీపారాధనకు చిన్న తేనె సీసాలో నూనె, వత్తులు, పసుపు, కుంకం, అగరువత్తులు, కర్పూరం బిళ్ళలు అన్నీ జాగ్రత్తగా పెట్టి బుట్ట సర్దుకుని నిద్రపోతున్న కూతుర్ని లేపకుండా తలుపులు దగ్గరగా వేసి నదిఒడ్డుకు చేరుకుంటుంది. ఆ సమయంలో వీధులన్నీ నిర్మానుష్యంగా శీతగాలులు వీస్తూ వుంటాయి. ఎక్కడా నర సంచారం వుండదు. ఆవిడ దంతావధానం చేసుకుని ముందు ఇంట్లో స్నానం చేసి మరీ నదీస్నానానికి వస్తుంది. "మరీ ఛాదస్తం, నదికి వెడుతున్నది స్నానానికే కదా.. మళ్ళీ ఇంట్లో కూడా చెయ్యటమెందుకు?" అడిగిందో అమాయకురాలోసారి. "అవుతే ఇంతేనుటే భ్రమరాంబా నీకు తెలిసింది? గోదావరంటే ఏమనుకుంటున్నావు.. మామూలు ఆషామాషీ పిల్లకాలవనుకుంటున్నావా.. గోదావరి జలదేవత ప్రత్యక్ష దైవం. పుణ్య పుష్కరిణి. ఆ పుణ్య ప్రవాహంలో మలినమైన కాళ్ళతో దిగి మన శరీరాలకు మనసులకు అంటిన పాపాలు ప్రక్షాళనం చేసుకుంటున్నాం. ఒక గుడిలో ప్రవేశించినప్పుడు మనం శుచిగా శుభ్రస్నానం చేసి, పరిశుభ్రమైన దేహంతో శుద్ధమైన హృదయంతో ఏవిధంగా వస్తామో, అదే విధంగా నదీ ప్రవాహంలో స్నానం చెయ్యాలి."

తెలిసిన వాళ్ళం పాటించవలసిన నియమాలు కొన్ని వున్నాయి. తెలియని వాళ్ళకి చెప్పాలి. ఆధ్యాత్మిక మార్గంలో మామ్మగార్ని అనుసరించి మోక్షసాధనకు తగిన కృషి చెయ్యాలని ఆ చుట్టుపక్కల స్త్రీలు మామ్మగారి శిష్యులు ప్రయత్నిస్తుంటారు. తిథేమిటో తెలుసుకోవటం దగ్గర్నించి పెద్ద, పెద్ద ధర్మ సూత్రాలు, సందేహాలు నివృత్తి చేసుకోవటానికి ఆవిడ్ని ఆశ్రయిస్తూవుంటారు. అయితే ఒక్కోసారి ఆవిడగారు చెప్పేవి ఆచరణకు సాధ్యం కాని విషయాలని భయపడి, మధ్యలో వదిలేస్తుంటారు. "మనసుకు పుటం వేయాలి. త్రికరణ శుద్ధిగా ధ్యానించాలి. ఆధ్యాత్మిక మార్గానికి అడ్డదారులు. షార్టుకట్‌లు వుండవే అమ్మాయీ! నిరంతర యజ్ఞంగా సాధనా కార్యక్రమం చెయ్యాలి. మన ఆరాధ్య దైవం ఎవరున్నా అందరి దేవుళ్ళనూ ఆదరించాలి. పంచభూతాలను దైవ స్వరూపులుగా ఎంచి పూజించాలి. పాంచభౌతికం ఈ దేహం. అన్ని ఇబ్బందులు, అడ్డంకులు గట్టెక్కాను. భగవదారాధనకు, సాధనకు ఈశ్వరుడింకా నాకు అవకాశాన్నీ, శక్తినీ ఇచ్చాడు జీవితాన్ని మానవ జన్మను సార్థకపరుచుకునే అవకాశం ఇప్పుడేనమ్మా.. ఓపికున్నంత చేసుకోనీ.."

"మనమంతా విషయ లంపటంలో పడి, అజ్ఞానాంధకారంలో కొట్టుకుంటున్నాం. కుడితిలో పడ్డ ఎలకల్లా.. ఆవిడ ధన్యజీవి. దేవుడిచ్చిన జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకుంటోంది, మనకాస్థితి ఎప్పటికో.." అని వాళ్లావిడని చూసి న్యూనతపడుతుంటారు.

పూర్వం రోజులు కావు. జనాలందరూ భేదం లేకుండా మమేకమైపోతున్నారు. అప్పుడంటే ఎవరి అంతరంలో వాళ్ళుండి ఎవరి విలువ వాళ్ళు కాపాడుకునేవారు. ఇప్పుడు తప్పుకోమంటే తప్పు. తెల్లారితే తండోప తండాలు. రేవులో దిగి స్నానం చెయ్యటమే. అనుకుంటూ తెల్లవారు ఝామునే తొలివేకువ కిరణాలింకా పొడవకముందే "గంగేచ యమునైచ గోదావరి కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు" అంటూ గోస్తనీనదిలో మునకలు వేసి

## ఆ ఉద్దేశమే లేదు!

పొడుగు కాళ్ళ సుందరి శిల్పాశెట్టికి ప్రేమ, పెళ్ళి గురించి ఆలోచించే ఉద్దేశమే లేదట! 'నీమీద ఎటువంటి వార్తలూ వినిపించడంలేదే?' అంటే "మేం ఒకటి చేస్తే మీరు నాలుగు రాస్తారు. అసలేదీ చేయకపోతే మీరు మాత్రం ఏం రాస్తారు. అందుకే అన్నిటికీ దూరంగా ఉంటున్నా!" అని సమాధాన మిచ్చింది. పెళ్ళెప్పుడు చేసుకుంటా వంటే మాత్రం "ఇప్పట్లో పెళ్ళి చేసుకోవాలనిపించడం లేదు. ప్రస్తుతానికి నా దృష్టంతా మా అక్కాచెల్లెళ్ల కెరీర్ గురించే!" అని చెప్పింది.

నీరోడుతున్న గుడ్డలతో ప్రాకారం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంది లింగాష్టకం, బిల్వాష్టకం, విశ్వనాథాష్టకాలతో గడ్డకట్టే చలిలో సోమేశ్వరుని ఉదకాభిషేకాలు – రాజరాజేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చన తృప్తికరంగా జరిపించి మరీ కదులుతుంది రేవులో. భక్తుల సందడి మొదలయ్యేసరికి మామ్మగారు ఇంటికి వచ్చేసి నిత్యానుష్ఠాన కార్యక్రమంలో పడుతుంది. గుళ్లో ఏ రోజూ తొలిపూజ ఆవిడదే. ఈవిడ గుడికి వచ్చే సమయానికి ఆలయ పూజారి వచ్చి గుడి తలుపులు తీసి శుభ్రపరుస్తుంటాడు. ఏ కారణం చేతనైనా మామ్మగారు వచ్చిన సమయానికి గుడి తలుపులు తెరవకపోతే, స్వామివారి ఆరామాన్నే ఆనుకుని వున్న ఆయన ఇంటి ముందుకు వెళ్ళి.."ఏమయ్యా.. పంతులు గారూ, ఇంకా లేవలేదూ.. ఎర్రగా వెలుగొచ్చాక తీస్తావా ఏమిటి గర్భగుడి.." అని హెచ్చరించి, తను రేవులో స్నానానికి దిగుతుంది ఆవిడ. నిష్ఠగా ప్రదక్షిణ పూర్తి చేసుకొచ్చేసరికి ఆదరాబాదరా సోమేశ్వరుడ్ని అర్చనకు సిద్ధం చేస్తాడాయన. "వచ్చారామ్మా.. రాత్రి ఊరెళ్ళి వచ్చేసరికి మరీ పొద్దుపోయింది. మిమ్మల్ని చూసి నేర్చుకోవల్సిందెంతో వుందమ్మా.. ఆ శ్రద్ధ.. ఆ నిష్ఠ.. భక్తి" అంటూ ప్రారంభిస్తే 'సరేలే' అని నవ్వుతుంది. పొగడ్తలకు పడే మనిషి కాదావిడ. "నన్ను చూసి ఒకరు నేర్చుకొనేదేముంది. నా కోసం నేను బతుకుతున్నాను. మన బతుకు మనం సవ్యంగా కడతేర్చుకుంటే చాలు." స్నానమయ్యాక మడిగా రాగి చెంబు నిండా తెచ్చిన గోదావరీ పావనోదకంతో "హరహర మహాదేవ, శంభో శంకర.. శివా.. శంకరా.. హర.. హరా" అంటూ శివనామస్మరణ చేస్తూ స్వయంగా ఆవిడగారు తొలి అభిషేకం చేసాకే ఎవరికైనా గర్భగుడిలో లింగానికి అభిషేకం చేసే అవకాశం..!


❊ ❊ ❊

వరలక్ష్మి ఏ వార్తయితే తల్లి చెవిన పడకూడదని దేవుళ్ళకి దణ్ణం పెట్టుకుంటోందో ఆ ముక్క కాస్తా ఎల్లాగోలా పెద్దావిడకి చేరిపోయింది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించబడిన శ్రీదత్తాత్రేయాశ్రమ ప్రారంభ ముహూర్తానికి పరమహంస పరివ్రాజక శ్రీశ్రీశ్రీ సిద్దేంద్రభారతీ స్వామివారు వేంచేస్తున్నారన్నది ఆ వార్త.

పదిరోజుల క్రితం తన డెబ్బై ఆరో సంవత్సరం ముగించుకుని మామ్మగారు డెబ్భై ఏడు కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టింది. అయితే అకస్మాత్తుగా ఆ రోజునుంచే ఆవిడ ఆరోగ్యంలో పెద్ద మార్పు సంభవించింది. వారం, పది రోజుల వ్యవధిలో ఊహించని విధంగా కంటికి కనపడని రుగ్మతేదో ఆవిడ్ని లొంగదీసుకుంది. ఉధృత వేగంతో ప్రవహించే చైతన్యవాహిని ఏదో గ్రీష్మతాపానికి ఎండిపోయినట్లు ఒక్కసారిగా చూస్తుండగానే ఆవిడ వడలిపోయింది. ఆకస్మిక వార్ధక్యం వ్యాఘ్రంలా మీదకు విరుచుకుపడి లేవనీయకుండా నిర్బలురాల్ని చేసింది. తెల్లవారు ఝాము చన్నీటి తలస్నానాలు – జపాలు, పూజలు, ఉపవాసాలు.. సంవత్సరాలుగా ఆవిడ జీవిత విధానాలుగా పాటిస్తూ వచ్చిన నిత్యనైమిత్తికాలాలన్నీ వెనుకపడిపోయాయి. తల్లిని చూస్తుంటే వరలక్ష్మి గుండె జారిపోతోంది.

"ఏమిటమ్మా.. ఇల్లా అయిపోతున్నావు? ఏమైందే" అంది కన్నీళ్ళతో. "భయంలేదు ఎవరికైనా ఇది సహజమే.. సునాయాసంగా వెళ్ళి పోగలిగితే అదే అదృష్టం. అమ్మాయ్, వరం ఆ తులసమ్మకు కాసిని నీళ్ళు పొయ్యి.. అమ్మవారి ముందు దీపం పెట్టు. జ్ఞానయోగం కాసేపు చదువుతావూ.. నాకు ఓపిక లేదు" అనటం ప్రారంభించింది.

డాక్టరు వచ్చి చూసి "పెద్ద వయసు.. మందు లేవీ పనిచెయ్యవు" అంటూ ఉపశాంతి కోసం మందులు రాసి వెళ్ళాడు. రోజులు గడిచే కొద్దీ తిండి హితవు పోయింది. అత్యవసరమైన పనులకు తప్ప మంచం దిగలేక పోతోంది మామ్మగారు. ఇటువంటి పరిస్థితిలో ఆవిడ వుండగా ఆశ్రమ ప్రారంభోత్సవానికి శ్రీ స్వామివారు వస్తున్నారని ఆవిడకు తెలిసింది. స్వామి వార్ని ఒక్కసారి చూడాలని ఎంతో అనుకున్నాను కుదరనేలేదు. ఇప్పుడాయన మన ఊరికే వస్తున్నారు. అమ్మాయ్.. నన్నెలాగయినా అక్కడికి తీసుకెళ్ళవే ఆ మహానుభావుడి దర్శనం చేసుకుంటే నా జన్మ సార్థకమౌతుంది." అంటూ ప్రారంభించింది. నిజంగా స్వామి వారిని దర్శించుకోవాలని ఆవిడ ఎంతకాలంగానో ఆశ పడుతోంది. ఇంతవరకూ ఆ అవకాశమే తటస్థపడలేదు. ఆయన అనుగ్రహ భాషణలో గ్రంథాలు ఎన్నో చదువుకుందావిడ. ఇప్పుడాయన స్వయంగా తమ ఊరినే పునీతం



## నేనేం చేసినా అతను ఏమీ అనుకోడు

'ఇంతలా ఎక్స్‌పోజింగ్ చేస్తున్నావు! నీ బాయ్‌ఫ్రెండ్ ఏమీ అనడా?' అని సందేహాన్ని వెలిబుచ్చితే సిగ్గుపడింది అమృతా అరోరా! "అతనూ మోడలింగ్ రంగం నుంచి వచ్చినవాడే! ఎక్స్‌పోజింగ్ చేస్తేనే హీరోయిన్‌గా నిలదొక్కుకోగలమన్న విషయం అతనికీ తెలుసు. అయినా ఎక్స్‌పోజింగ్ వల్ల అతనికొచ్చే నష్టమేమీ లేదుగా!" అంటూ వెల్లడించింది నర్మగర్భంగా అమృతా అరోరా!

చెయ్యబోతున్నారు. వెళ్ళి దర్శనం చేసుకుని నమస్కరించుకోకుండా వుండగలదా. మన సాగుతుందా. తల్లి మనసు వరలక్ష్మికి తెలుసు. పాపం ఈ మాయదారి రోగం ఇప్పుడే వచ్చి పడిందేమిటి. లేవలేని స్థితిలో వుంది. ఎలా తీసుకెళ్ళటం. తీసుకెళ్ళకుండా తన ప్రాణం ఊరుకుంటుందా. ఎలాగోలా అమ్మ కోరిక నెరవేర్చాలి. స్వామీజీ దర్శనం ఆవిడకి కలిగేలా చెయ్యాలి. అని పరిపరి విధాలా ఆలోచిస్తోంది. కూతురి సాయంతో స్నానంచేసి శుభ్రవస్త్రాలు ధరించింది మామ్మగారు. స్వామివారు సరిగా ముహూర్త సమయానికి ప్రధాన మార్గం గుండా ఊరేగింపుగా ఆశ్రమానికి చేరుకునే సమయం దగ్గరపడింది. "నాకు ప్రాప్తముంటే దర్శించుకోగలుగుతాను స్వామివార్ని. ఏమో ఆయన సంకల్ప మెలావుందో.." అనుకుంటోంది. "అమ్మా.. మెల్లిగా నా చెయ్యి పుచ్చుకుని లే.. ఆశ్రమానికి వెడదాం. ముహూర్తం వేళవుతోంది. రిక్షా పిలిచాను" అంది తల్లి దగ్గరగా వచ్చి. వింటూనే మామ్మగారికి ఎక్కడలేని బలం వచ్చినట్టై కూతురు చెయ్యి పుచ్చుకుని చప్పున పైకి లేచింది. వీధి గుమ్మందాకా వచ్చి చప్పున కుప్పలా క్రిందకు జారిపోయింది. "అమ్మా.. అమ్మా.. ఏమైంది?!" అని విలవిలలాడుతోంది వరలక్ష్మి. "ఏంకాలేదు.. వెడదాం.. స్వామీజీ.. దర్శనం అవుతుందమ్మా.. ఆయనే వస్తారు" అంటోంది మగతగా, కలవరింతగా.

అకస్మాత్తుగా తమ సందు మొదల్లో నుంచి పెద్దపెట్టున మంగళవాద్యాలు, వేదఘోష జనం కలకలం వినిపించి ఆశ్చర్యపోయింది. "ఏమైంది స్వామీజీ మన వీధిలోకే వస్తున్నా రమ్మా. కాస్త ఓపిక తెచ్చుకునిలే.." అంది. "ఇటొస్తున్నారా స్వామీజీ.. ఏమైందీ?" ఎవరో దారిన ముందు పరుగులు తీస్తున్నవాళ్ళు చెప్తున్నారు. "ప్రధాన మార్గంలో ఏదో పెద్ద ప్రమాదం జరిగింది. ఊరేగింపు ఇటు మళ్ళించారు" అనుకోని హఠాత్సంఘటనకు తడబడిపోయింది. మామ్మగారి హృదయం ఒక్కసారిగా మహాబలమేదో తన్నావరించినట్లు.. "స్వామీజీ వస్తున్నారా ఇటు, ఎంత సుకృతం" అంటూ కూతురి ఆసరాతో వీధి గుమ్మంలోకి తడబడుతూ వచ్చింది. సరిగ్గా అదే సమయంలో ముందు పూర్ణకుంభంతో వేదమంత్రఘోష దిక్కులను పిక్కటిల్ల చేస్తుండగా మేళతాళాలతో శిష్యబృందం, పురప్రముఖులు అల్లంత దూరాన అనుసరించి వస్తుండగా పరమాచార్య మామ్మగారి వాకిలి ముందుకు వచ్చారు. "అమ్మా స్వామీజీ వచ్చారు. దణ్ణం పెట్టుకో" అంటోంది తల్లిని పొదివి పట్టుకుని ఆరాటంగా వరలక్ష్మి. సరిగ్గా ఇంటిముందుకు వచ్చి క్షణం ఎందుకోన్నట్లు ఆగారు స్వామి. దేదీప్యమానంగా వెలిగిపోతున్న కళ్ళలో ఆనందాశ్రువులు దొర్లిపోతుండగా చలించిపోతున్న పలుకులు కూడదీసుకుని "స్వామీ పరమాచార్య ధన్యురాల్ని" అంటూ దోసిలొగ్గి ముందుకు వంగి ఆయన పాదాల ముందు ఆర్తిగా ప్రణామం చేసింది మామ్మగారు. చిరునవ్వుతో దయగా చూస్తూ ఆవిడ శిరస్సున చెయ్యుంచి అనుగ్రహించి అంతలోనే ముందుకు కదిలారు స్వామి. నివ్వెరపాటుకు గురై నోటమాటలేక అక్కడే నిలబడిపోయిన జనం "మామ్మగారు.. అదృష్టవంతురాలు.. ఇందుకే స్వామివారి ఊరేగింపు ఇటువైపుకు మరల్చాడా దేవుడు" అని వింతపడుతూ కదిలారు.

తన జన్మ సఫలమైందని భావించింది మామ్మగారు. ఆ భగవంతుడావిడ కోరిక తీర్చాడని ఆనందపడింది వరలక్ష్మి. ఆ తరువాతేం జరిగిందో వివరించవలసిన అవసరం లేదు. నిజానికి జీవితంలోనే మరణం దాగి వుంది. మరణం లేకుండా జీవితం సంపూర్ణం కాదు. జీవితాకర్షణకు, ఆనందానికీ, ఆరాటానికీ. జీవితానికే మరణం ఆధారం. కొందరు మరణించినా సాటివారి హృదయాల్లో జీవించే వుంటారు. మామ్మగారి కథలు, కథలుగా తలుచుకుంటారు జనం. ఆవిడ జీవితాన్ని మననం చేసుకుంటూ ఆమెలా ధన్యత పొందాలనుకుంటారు. మామ్మగారి దృఢసంకల్పసిద్ధికి ఉదాహరణగా స్వామీజీ సంఘటన స్మరించుకుంటారు. మామ్మగారి జీవితం ఆగిపోలేదు కానరాని చైతన్యవాహినిగా అందరి హృదయాల్లోనూ ప్రవహిస్తూనే వుంది. ఆగిపోయేది కాదు. సాగిపోయేదే. ముమ్ముందుకు తరలిపోయేదే ప్రవాహం. ప్రవాహమే జీవితం. ❦

## తెలుసుకోండి

❋ ఈ సంవత్సరం జనవరి నుండి జూన్ వరకూ 132 రైలు ప్రమాదాలు జరిగాయి.

❋ మన దేశంలో 34.59 లక్షల మంది కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగులు.

❋ ఆంధ్రలో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ముఖ్యమంత్రి చేసిన వాగ్దానాలు నెరవేరాలంటే 70,000 కోట్లు కావలసి ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉవాచ.

